క్లుప్తంగా

పుస్తకాలు అందజేత


పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ నాగరమేశ్

వేములవాడ: జ్ఞానాన్ని పెంపొందించేవి పుస్తకాలేనని, ఇలాంటి పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని డాక్టర్ నాగరమేశ్ అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి గురువారం వైద్య దంపతులు డాక్టర్ నాగరమేశ్– పద్మావతి రూ. 30 వేల విలువైన పుస్తకాలను లైబ్రేరియన్ అనిత చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తదితరులు వైద్య దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో కుంకుమపూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని సుద్దాల చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం కుంకుమపూజలు నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా ఆలయంలో ప్రతీ సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో అర్చకులు మంగళగిరి లక్ష్మయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే.లక్ష్మీనారాయణ కేక్ కట్‌చేయగా ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎంపీవో మీర్జా బేగ్, సూపరింటెండెంట్ రమేశ్, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌స్కూల్‌లో..

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని విజ్ఞాన్ స్కూల్‌లో గురువారం న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు యాజమాన్యం కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపింది. స్కూల్ వ్యవస్థాపకులు లతీఫ్ పాల్గొన్నారు.

బీజేపీ గ్రామశాఖ ఎన్నిక

కోనరావుపేట: మండలంలోని కనగర్తి బీజేపీ అధ్యక్షుడిగా కురుకుంట్ల బాలకృష్ణ ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో 245 బూత్ అధ్యక్షుడిగా పోగుల లచ్చిరెడ్డి, 246 బూత్ అధ్యక్షుడిగా గుజ్జేటి శంకర్, యూత్ అధ్యక్షుడిగా గా రావులపల్లి వెంకటరెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగింపు


విద్యుత్ వైర్లు స్వాధీనం చేసుకున్న సెస్ సిబ్బంది

వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్ల గ్రామపంచాయతీ వద్ద ఉన్న అర్బన్ ఫీడర్‌లో విద్యుత్ సమస్య తలెత్తంగా జీపీ కార్మికుడు కోతి మల్లేశం గత సోమవారం ఫ్యూజ్ వైర్ వేసే సమయంలో విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాలయ్యాయి. దీనిపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కాగా మండల సెస్ ఏఈ రమేశ్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బందితో కలిసి అక్రమ విద్యుత్ కనెక్షన్లను గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ ఫీడర్‌పై అధిక విద్యుత్ లోడు పడటంతో తరచూ అంతరాయం ఏర్పడుతుందని, రైతులు బోరు మోటార్లకు కొత్త కనెక్షన్లు తీసుకోవాలన్నారు. హెల్పర్లు లక్ష్మీరాజం, శ్రీహరి, గోవింద్ తదితరులున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

వీర్నపల్లి: అడవిపదిరలో బీఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని గురువా రం గ్రామ యువకులు కరపత్రం ఆవిష్కరించారు. ఈనెల 5న ఆదివారం ర్యాలీ ప్రారంభమవుతుందని, అనంతరం విగ్రహావిష్కరణ, సభ ఉంటుందని, ప్రధానవక్త కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, విమలక్క అరుణోదయ కళాకారులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేటీఆర్, కొండూరి రవీందర్ రావు, సత్యం పాల్గొంటున్నారన్నారు.

నెరవేరనున్న దశాబ్దాల కల

- ముమ్మరంగా సూరమ్మ ప్రాజెక్టు పనులు
- సస్యశ్యామలం కానున్న 50 వేల ఎకరాలు
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు


ముమ్మరంగా సాగుతున్న సూరమ్మ ప్రాజెక్టు పనులు

రుద్రంగి: రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి, భీ మారం మండలాల రైతుల దశాబ్దాల కల నెరవేరనుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సూరమ్మ ప్రాజెక్టు పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సూరమ్మ ప్రాజెక్టుతో పాటు ఫేజ్ 2 స్టేజ్ 1లో భాగంగా కుడి, ఎడమ కాలువలను తవ్వి కాలువల ద్వారా సాగు నీటిని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల రైతుల పొ లాలకు సాగు నీరందిస్తూ భూగర్భజలాల వృద్ధికి డ్రాప్టులు నిర్మించనున్నారు. దీంతో మెట్ట ప్రాంతమై న ఈ ప్రదేశంలో భూగర్భజలాలు పెరిగి ఆయా మండలాల రైతులు, ప్రజలు సాగు, తాగునీటి ఎద్దడికి ఇబ్బందులు తొలగుతాయని హర్షం వ్యక్తంచేస్తున్నారు.

50వేల ఎకరాలకు సాగునీరు..

సూరమ్మ ప్రాజెక్టు పూర్తయితే మెట్ట ప్రాంతమైన రుద్రంగి, కథలాపూర్, మేడిపెల్లి, భీమారం మండలాల్లోని 50 వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలమై సాగులోకి వస్తాయి. కుడి, ఎడమ కాలువల ద్వారా పంట పొలాలకు నీరందిస్తారు. నాలుగు మండలాల్లోని చెరువులు జలకళను సంతరించుకోనున్నాయి. ఎల్లంపెల్లి నుంచి కాలువల ద్వారా సూరమ్మ ప్రాజెక్టుకు గోదావరి నీటిని ఎత్తిపోస్తూ ఆయా మండలాల్లోని చెరువులను గోదావరి నీటితో నింపనున్నారు. దీంతో వేసవిలో నీటి ఎద్దడి లేకుండాత తప్పుతుంది. సూరమ్మ ప్రాజెక్టు పూర్తయితే ప్రాజెక్టులో చేపలు పెంచడంతో మత్స్య సంపద పెరుగుతుందని మత్స్యకారులు హర్షం చేస్తున్నారు.

2018లో భూమిపూజ

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2018 జూన్ 22న అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు సూరమ్మ ప్రాజెక్టు పనులకు భూమిపూజ చేశారు. కొన్ని ఏళ్లుగా ప్రాజెక్టు పనులు చేపట్టకపోవడంతో ఆది శ్రీనివాస్‌తోపాటు పలువురు నిరసన తెలిపారు. అయినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు చేపట్టకపోవడంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలోపే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు ఏడాదిలోపే రూ.325 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు.

వేల ఎకరాలు సాగులోకి..




సూరమ్మ ప్రాజెక్టు పూర్తయితే రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి, భీమారం నాలుగు మండలాల్లోని వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టు పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఈ ప్రాంత రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు. సాగునీటి కోసం ఎదురు చూస్తున్న ఈ ప్రాంత రైతుల దశాబ్దాల కల నెరవేరుతుంది. – తర్రె లింగం, రైతు, రుద్రంగి

గంగపుత్రులకు ఉపాధి



సూరమ్మ ప్రాజెక్టుతో మత్స్య సంపద పెరగడంతో పాటు గంగపుత్రులకు ఉపాధి దొరుకుతుంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న సూరమ్మ ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతుండడం సంతోషంగా ఉంది. వేల ఎకరాలు సస్యశ్యామలమవుతాయి. వేసవిలో పంటలు సాగుచేసిన రైతులకు సాగునీటికి ఇబ్బందులు ఉండవు – దేశవేని శ్రీనివాస్, గంగపుత్రుడు, రుద్రంగి

హామీని అమలుచేశాం



సూరమ్మ ప్రాజెక్టు పనుల ప్రారంభం కోసం ప్రతిపక్షంలో ఉండగా వివిధ రకాల్లో నిరసనలు చేపట్టాం. అయినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సూరమ్మ ప్రాజెక్టును ప్రారంభించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని మాట ఇచ్చాం. హామీప్రకారం ప్రాజెక్టు పనులు ప్రారంభించాం. – ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే

క్యాలెండర్లు ఆవిష్కరణ


సిరిసిల్ల కల్చరల్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ


ఎల్లారెడ్డిపేటలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి

సిరిసిల్ల కల్చరల్ : కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బ్యాంక్ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ అధ్యుడు శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్ దామోదర్, ఫీల్డ్ అధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఖాతాదారులు, సంఘం సభ్యులకు, రైతులకు క్యాలెండర్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు ఎల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి, దొమ్మాటి నర్సయ్య, వెంకట నర్సింహరెడ్డి, సీఈవో కిశోర్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. మండల మున్నూరు కాపు పటేల్ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం భవనంలో 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించి పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు నంది కిషన్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మీసం రాజం, బాల్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు


కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శశిధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ముస్తాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు అన్నం శశిధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు గురువారం కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శశిధర్‌రెడ్డితోపాటు ఆయన కొడుకు అరుష్‌రెడ్డి, కూతురు శ్రియారెడ్డి ఉన్నారు.

క్యాలెండర్లు పంపిణీ

సిరిసిల్ల: సిరిసిల్ల 32వ వార్డులో గురువారం నూతన సంవత్సర క్యాలెండర్లు, వేములవాడ ఆలయ లడ్డూలను ఇంటింటికీ స్థానిక కౌన్సిలర్ సీమాబేగం, అక్రమ్ పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా వార్డులో క్యాలెండర్లు, లడ్డూలు పంపిణీ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ వెంట స్థానిక నాయకులు గోసిక అనిల్‌కుమార్, బేతి కరుణాకర్, పడిగె పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై దాడిచేసిన వారి కోసం గాలింపులు

చందుర్తి: చందుర్తిలోని ఆర్‌ఎంపీ వైద్యునిపై దాడిచేసిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది. ఆర్‌ఎంపీపై దాడి సమయంలో తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దాడిచేసిన నిందితులను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. బాధితుడు ఫిర్యాదు చేయకపోవడంతో దాడి జరగలేదని పోలీసులు బుధవారం విలేకరులకు తెలిపారు. కానీ గురువారం వీడియో వైరల్‌తో దాడి ఆరోపణలకు బలం చేకూరింది. దాడి చేసిన ఇద్దరు యువకులు గ్రామాలను వదిలి దుబాయ్ వెళ్లిపోయినట్లు ప్రచారంలో ఉంది. కాగా ఇప్పటికే దాడి ఘటనలో ప్రధాన నిందితునిగా భావిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మండల కేంద్రంలో దాడిచేసిన సంఘటనను పోలీసులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతేకాకుండా దాడి జరిగి వారం రోజులు గడుస్తున్నా చందుర్తి పోలీసులకు తెలియకుండా జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో చందుర్తి పోలీసులు దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

సిరిసిల్లకల్చరల్: సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి నిర్వహించే సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. బీవైనగర్‌లోని అమృత లాల్ శుక్లా కార్మికభవనంలో గురువారం జరిగిన సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, దాసరి రూప, లక్ష్మీరాజం, పోచమల్లు పాల్గొన్నారు.

భూమిని అక్రమంగా సాగుచేసుకుంటున్నారని ఫిర్యాదు



చందుర్తి: వ్యవసాయ భూమిని అక్రమంగా సాగు చేసుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ చందుర్తికి చెందిన పోంచెట్టి వనజ ఎస్పీ అఖిల్ మహాజన్‌ను గురువారం ఆశ్రయించింది. గ్రామ శివారులోని 155, 157 సర్వే నంబర్‌లో ఎకరం భూమిని తన భర్త హన్మంతుకు మద్యం తాగించి అదే గ్రామానికి చెందిన మోతె రాములు రూ.14లక్షలు అతనితో అగ్రిమెంట్ చేసుకొని సాగు చేసుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ట్రాక్టర్‌తో భూమిని దున్నిస్తుండగా అడ్డు వెళ్లిన తమ కుమారుడిని చంపుతామని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా అగ్రిమెంటు భూమిని దౌర్జన్యంగా సాగుచేసుకుంటన్న రాములుపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వనజ కోరింది.

వ్యక్తి రిమాండ్


లక్కె మధు

వేములవాడరూరల్: మహిళకు తెలియకుండా తన అకౌంట్‌లోని డబ్బులను మరో అకౌంట్‌లోకి మార్చిన సదరు వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లికి చెందిన మాదాసు మంజులకు తెలియకుండా తన అకౌంట్ నుంచి అదే గ్రామానికి చెందిన లక్కె మధు తన అకౌంట్లోకి రూ. 2 లక్షల 50 వేలు మార్చుకున్నాడు. ఇది గుర్తించిన మహిళ ఎస్‌బీఐ బ్యాంకు అధికారులను అడగగా అసలు విషయం బయటపడింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత

సిరిసిల్ల క్రైం: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా రవాణా శాఖ సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారిని రజనీదేవి ఉన్నారు. జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్టీఏ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లు ఇతర వాహనాలు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. అసిస్టెంట్ మోటార్ వాహనాధికారి రజనిదేవి, సిబ్బంది కానిస్టేబుల్ రమ్య, సౌమ్య, ప్రశాంత్, హోంగార్డ్ ఎల్లేశ్ పాల్గొన్నారు.

పర్యావరణ ప్రేమికుడికి ఇండియన్ ఐకాన్ పురస్కారం


రమేశ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన పర్యావరణ ప్రేమికుడు దుంపెన రమేశ్ స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారానికి ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డు అందజేయనున్నారు. 14 ఏళ్లుగా రమేశ్ దాదాపు 80వేల వరకు మొక్కలను పంపిణీ చేశారు. రమేశ్ చేస్తున్న కృషిని గుర్తించి వరుసగా అవార్డులు దక్కుతున్నాయి. ఈ అవార్డు పదోది కావడం విశేషం.

ఈద్గా పనుల పరిశీలన



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలో ఈద్గా పనులను మైనార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. మజీద్ కమిటీ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం ఈద్గా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. ఇక్కడ కమిటీ అధ్యక్షుడు రంజాన్, బషీర్, అయూబ్, జహంగీర్, సత్తార్, షాదుల్లా, దర్వేష్, షాదుల్ ఉన్నారు.

వైద్య పరీక్షలు

కోనరావుపేట: మండలకేంద్రంలో గురువారం వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి శాంపిళ్లు సేకరించారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో కృష్ణమూర్తి, కార్యదర్శి సాయికృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోతుల బెడదకు చెక్

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో కోతుల బెడదకు గ్రామస్తులు చెక్ పెట్టే చర్యలు తీసుకుంటున్నారు. 12వ వార్డులో రహదారిప్రాంతంలో వందలాది కోతులు సంచరిస్తూ ఆప్రాంత వాసుల కు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు ఒక్కటై కోతులను పట్టేవాళ్లను తీసుకొచ్చారు. బోనులను ఏర్పాటుచేయించి కోతులను పడుతున్నారు.



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఆరునెలలు గడుస్తున్నా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. పాత భవనంలో టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు లేవు. కొత్త భవనాన్ని ప్రారంభిస్తే రోగులు, వైద్య సిబ్బందికి మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని ప్రజలు పేర్కొంటున్నారు. వెంటనే కొత్త భవనంలోకి ఆస్పత్రిని మార్చాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
హాఫీజా, వైద్యాధికారి, పోతుగల్. సెల్ నంబర్: 9515240086

వాట్సాప్ చేయండి..
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి


అవగాహన కల్పిస్తున్న వక్తలు

గంభీరావుపేట: గంభీరావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొనగా ఇంపాక్ట్ ఫౌండేషన్ వక్తలు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో అవగాహన కల్పించారు. పరీక్షలంటే భయం వీడాలని, ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో వక్తలు వెంకట్‌రావు, తిరుపతి, సాయిబాబు, సుధాకర్, పర్శరాం, తేజస్విని, ఎంఈవో గంగారాం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాంచంద్రం, కమలాకర్‌రెడ్డి, నరసింహారాజు, నాగరాజుగౌడ్, సంతోష్‌రెడ్డి, కిషన్, ఎల్లం, పోతుల నారాయణ, పర్శరాములు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ సస్పెన్షన్

- కోడిగుడ్డు కోసమే సస్పెన్షనా ?!
- ఆర్టీఐని ఆశ్రయించిన బొప్పాపూర్ గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ నీరటి భవానిని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం గురువారం సస్పెండ్ చేశారు. అయితే అంగన్‌వాడీ టీచర్ సస్పెన్షన్ గ్రామంలో వివాదాస్పదంగా మారింది. దీనిపై ఇప్పటికే గ్రామస్తులు ఆర్టీఐని ఆశ్రయించినట్లు తెలిసింది. కోడిగుడ్ల వ్యవహారమే సస్పెన్షన్‌కు దారీ తీసిందా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాచర్లబొప్పాపూర్‌లోని అంగన్‌వాడీ టీచర్ నీరటి భవాని చిన్నారులకు సక్రమంగా కోడిగుడ్లు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ తల్లిదండ్రులు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్ అధికారులు భవానికి మెమో జారీచేయడంతోపాటు రెండు సార్లు హెచ్చరించారు. బెస్త సిద్దార్థ్ అనే బాలుడికి కోడిగుడ్లు ఇవ్వడం లేదని బాలుడి తండ్రి బెస్త నరేశ్ టీచర్‌తో ఘర్షణ పడ్డాడు. నరేశ్ తనను మానసికంగా వేధిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఈ విషయం చినికిచినికి గాలివానలా తయారైంది. కోడిగుడ్ల పంపిణీపై విచారణ చేపట్టాలని బెస్త నరేశ్ అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. ఈక్రమంలోనే భవానికి ఒకసారి మెమో, రెండుసార్లు హెచ్చరికలు జారీచేశారు. చివరిగా సస్పెండ్ చేస్తూ జిల్లా సంక్షేమాధికారి ఉత్తర్వులు జారీచేశారు. భవాని సస్పెన్షన్‌పై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కోడిగుడ్ల వ్యవహారంలోనే సస్పెండ్ చేశారా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే చ ర్చ గ్రామంలో సాగుతోంది. భవాని సస్పెన్షన్‌పై ఆ ర్టీఐని ఆశ్రయించినట్లు గ్రామస్తులు తెలిపారు. మొ త్తంగా భవాని సస్పెన్షన్ వివాదాస్పదంగా మారింది.

కార్యవర్గం ఎన్నిక



ముస్తాబాద్: మండలంలోని గూడెం ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా శాడ అశోక్, ఉపాధ్యక్షులుగా ఎల్లం, ప్రధాన కార్యదర్శిగా ఎల్పుల నర్సయ్య, కోశాధికారిగా పుట్ట రమేశ్, రైటర్‌గా శాడ ప్రసాద్ ఎన్నికయ్యారు.

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో వాయుధూత ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడిగా రావులపెల్లి మహిపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. గ్రామంలో సమావేశమైన ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షుడిగా వూరడి గంగరాజు, కోశాధికారిగా బుర్ర శేఖర్, కార్యవర్గ సభ్యులుగా అనుపాటి భూంరెడ్డి, జిల్లెల్ల లక్ష్మారెడ్డి, శంకర్, గోపాల్, సగ్గు నరేందర్‌రెడ్డి. రాజిరెడ్డి, ఎన్నికయ్యారు.

'బీఆర్‌ఎస్ ఆరోపణలను తిప్పికొట్టండి'


మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: రైతులకు నష్టం జరుగుతుందని బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిప్పికొట్టాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రైతుభరోసా ను ప్రభుత్వం ఎగవేతకు ప్రయత్నిస్తోందన్న బీఆర్‌ఎస్ నా యకులు చేస్తున్న తప్పుడు ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చే శారు. ఇప్పటికే రైతులకు రూ.2లక్షల రు ణమాఫీ చేశామని, త్వరలోనే రైతుభరో సా అందజేస్తామని స్పష్టం చేశారు.

నియామకపత్రం అందజేత


నియామకపత్రం అందుకుంటున్న రమేశ్

వేములవాడరూరల్ : వేములవాడ రూరల్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా బాలరాజుపల్లి గ్రామానికి చెందిన నేదూరి రమేశ్ నియామకమయ్యారు. జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు నియమించగా గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ గౌడ్, సాగరం వెంకటస్వామి, రోమాల ప్రవీణ్, ఏఎంసీ డైరెక్టర్ వస్తాద్ కృష్ణ, అచ్చ వినోద్, జాగిరి సురేశ్, ఎడపెల్లి విష్ణు, బండి కొండయ్య, మాసం విష్ణు, రొండి సాయి, శేఖర్, గుంటి కొమురయ్య, లక్ష్మణ్ లు పాల్గొన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడికి, మండల నాయకులకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌కు సిరిసిల్ల డిపో ఆర్టీసీ బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. గన్నెవారిపల్లె వద్ద నక్కవాగుపై వంతెన నిర్మాణం పూర్తయిందని, రెండేళ్లుగా వంతెన పనులు జరగడంతో సేవాలాల్ తండా మీదుగా ముస్తాబాద్ వరకు నడిచే బస్ సర్వీస్‌ను రద్దు చేశారన్నారు. వంతెన పూర్తయినందున తిరిగి బస్సును నడపాలని కోరారు.